క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఏఎస్.రెడ్డి నగర్, రైల్వే ట్రాక్, మసీదు, చింతల్ బ్యాంక్ కాలనీ, టీచర్స్ కాలనీ, పుప్పాల గుట్ట, గోవిందరాజుల గుట్ట, స్టేషన్ రోడ్డు, సీకేఎం మెటర్నటీ ఆస్పత్రి, అండర్ బ్రిడ్జి, పోస్టాఫీస్, కృష్ణా కాలనీ, బీట్ బజార్, ఎస్‌వీఎస్ రోడ్డు, జేపీఎస్ రోడ్డు, వరంగల్ చౌరస్తా, డాల్ఫిన్ హోటల్, గిర్మాజీపేట, కాశిబుగ్గ, శాంతినగర్, మదీనా రోడ్డు, పద్మానగర్, తిలక్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి



వరంగల్ క్రైం: తామంతా ఇతర మతాలను పరస్పరం గౌరవించుకుంటూ పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పిలుపునిచ్చారు. కమిషనరేట్ కార్యాలయంలో వివిధ మతాలకు చెందిన మత పెద్దలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోదరభావంతో పండుగ వేళ ఒకరికిఒకరు సహకరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏసీపీలు నందిరాంనాయక్, ప్రశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో నియామకాలు



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు విభాగం అధిపతిగా డాక్టర్ చింతం ప్రవీణ్, ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగం అధిపతిగా డాక్టర్ సుచరిత పాల్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి మంగళవారం తెలిపారు. వారిని వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, అధ్యాపకులు అభినందించారు.

రవికుమార్‌కు సర్దార్ పటేల్ జాతీయ పురస్కారం




హన్మకొండ: సర్దార్ పటేల్ జాతీయ పురస్కారానికి హనుమకొండ మండలం పలివేల్పుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెనిశెట్టి రవికుమార్ ఎంపికయ్యారు. పర్యావరణ పరిరక్షణతో పాటు విద్య, సామాజిక, దివ్యాంగులకు సేవలతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రవికుమార్ సేవలను గుర్తించిన గుజరాత్‌కు చెందిన శిక్షా సాగర్ సంస్థ.. సర్దార్ పటేల్ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈనెల 5న గుజరాత్‌లో జరగనున్న కార్యక్రమంలో ఆయనకు అవార్డును ప్రదానం చేయనున్నారు. అవార్డుకు ఎంపికైన రవికుమార్‌ను మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ.రామారావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

టీపీసీసీడీ హనుమకొండ అధ్యక్షుడిగా బొచ్చు చందర్



నయీంనగర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ (టీపీసీసీడీ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బొచ్చు చందర్ ఎన్నికయ్యారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, సుంకరి శ్రీనివాస్ రెడ్డి, దడబోయిన వీరస్వామికి చందర్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో శ్రీనివాస బాలరాజు, గోనెల్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే నిబంధనలు పాటించాలి



ఖిలా వరంగల్: రైలు పట్టాలకు ఇరువైపులా ఉన్న ఆయా కాలనీల వాసులు రైల్వే నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆర్పీఎఫ్ ఎస్సై జి.వెంకటేశ్వర్లు సూచించారు. ఈమేరకు వరంగల్ రైల్వే స్టేషన్ సమీప కాలనీ ప్రజలతో ఆర్పీఎఫ్ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లపై రాళ్లు విసరకూడదని, రాళ్లు విసిరితే చట్ట ప్రకారం కేసు నమోదు చేసి శిక్షిస్తామని ఎస్సై వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

భూసారం పెంచే పచ్చిరొట్ట

- పచ్చిరొట్ట సాగుతో రసాయనిక ఎరువుల మోతాదు తగ్గుదల



కాజీపేట: పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోవడంతో భూసారం తగ్గిపోయి రైతులకు పెట్టుబడి భారం అధికమవుతోంది. దీంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడి భూమి తన సహజత్వాన్ని కోల్పోయి, రానురాను సాగుకు యోగ్యం కాకుండా పోయే పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. భూమి సారవంతం కావాలంటే తప్పనిసరిగా సేంద్రియ ఎరువులైన పశువుల పేడ, కోళ్ల, గొర్రె, మేకల ఎరువులు, వర్మి కంపోస్టు లాంటి ఎరువులు వాడితే నేలకు జవసత్వాలు అంది పంట దిగుబడులు వస్తాయి. వ్యవసాయ రంగంలో పశువులు తగ్గిపోవడంతో పశువుల ఎరువులు కొరతగా ఉన్నాయి. సేంద్రియ ఎరువుల లభ్యత తక్కువగా ఉండడంతో ఇలాంటి పరిస్థితుల్లో రైతులు పచ్చిరొట్ట సాగుకు మక్కువ చూపుతున్నారు. ఖరీఫ్ సాగుకు ముందు పచ్చిరొట్ట పంటసాగు చేసి పూత దశకు వచ్చిన సమయంలో భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట సాగువల్ల నేల కోతకు గురికాకుండా ఉంటుంది. పచ్చిరొట్టగా జీలుగ, జనుము, పిల్లపెసర, అలసంద, మినుము, పెసలు లాంటి పప్పు ధాన్యాలను సాగు చేస్తూ రైతులు ప్రయోజనం పొందుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు జీలుగ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నారు.

రసాయన ఎరువులు తగ్గి పెట్టుబడి ఆదా

ఖరీఫ్‌లో పచ్చిరొట్ట సాగుచేసే రైతులకు రసాయనిక ఎరువుల మోతాదు వాడకం తగ్గి పెట్టుబడిలో ఎంతో కొంత ఆదా అవుతుంది. ఖరీఫ్‌కు ముందు పచ్చిరొట్ట సాగుచేసి సుమారు 50, 55 రోజుల్లో పూతదశలో భూమిలో కలియదున్నడం వల్ల పచ్చిరొట్ట ఎరువు నేలకు ఆరోగ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. కీలకమైన పోషకాలను అందించడంతో నేల నిర్మాణాన్ని మెరుగుపరుస్తుంది. నీటి సంరక్షణ ద్వారా స్థిరమైన వ్యవసాయానికి దోహదం చేస్తుంది. తెగుళ్లు, కలుపు మొక్కలను నియంత్రించడానికి సహాయ పడుతుంది. నేల స్వభావానికి అనుకూలంగా పచ్చిరొట్ట ఎరువు సాయంతో భూమిని సారవంతంగా మార్చవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పచ్చిరొట్ట భూమికి రక్ష. నేలలో లభ్యంకాని రూపంలో ఉన్న అనేక పోషకాలను లభ్యరూపంలోకి మారుస్తుంది.

పచ్చిరొట్టతో ప్రయోజనాలు

సేంద్రియ ఎరువుల లభ్యత తక్కువగా ఉన్న ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట వాడకం వల్ల భూమిలో సేంద్రియ కార్బనం పెరగడమే కాకుండా భౌతిక స్థితిగతులు మారుతాయి. భూమి గుల్లబారి నీరు నిలుస్తుంది. సూక్ష్మజీవులు పెరగడానికి పచ్చరొట్ట ఉపయోగపడుతుంది. రసాయనిక ఎరువుల వాడకం మోతాదు తగ్గి సాగు ఖర్చులు ఆదా అవుతాయి. అంతేకాకుండా వాతావరణం కాలుష్యం తగ్గించిన వారమవుతాం. పచ్చిరొట్ట వల్ల చీడపీడల బెడద తగ్గుతుంది. సేంద్రియ కర్బనం బాగుపడుతుంది. పచ్చిరొట్ట ఎరువుల వాడకం వల్ల భూమికి నత్రజని, భాస్వరం, పొటాష్ అందుతుంది. వాటితో పాటు సూక్ష్మ పోషకాలు పంటకు అందుతాయి. రసాయనిక ఎరువుల వాడకం వల్ల నేల సారం తగ్గిపోవడమే కాకుండా భూమి, నీరు, వాతావరణం కలుషితం అవుతున్నాయి. నేలసారం పెంపొందడానికి పచ్చిరొట్ట ఎరువులు ఉపయోగపడడంతో పాటు పంటల దిగుబడులు పెరుగుతాయని కాజీపేట మండల వ్యవసాయ అధికారి సంతోష్ సూచిస్తున్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని

నయీంనగర్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో సమస్యాత్మక రోడ్లను నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉంచామని, వర్షాకాలం నేపథ్యంలో అంతర్గత రోడ్ల పనులను సత్వరమే పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ 53వ డివిజన్ విజయగణపతి కాలనీ, మహాత్మానగర్, హన్మంతరావు నగర్‌లలో రూ.85 లక్షలు, 54వ డివిజన్ సగర కాలనీలో రూ.33 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ 16 నెలలుగా నగరంలో ఉన్న ప్రధాన అంతర్గత రోడ్లను పూర్తిచేసినట్లు గుర్తుచేశారు. నగరాభివృద్ధి, పరిశుభ్రత పట్ల జూన్ 2నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు చేపట్టిన 100 రోజుల అభివృద్ధిలో ప్రణాళికలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్పొరేటర్లు గుంటి రజిత, సోదా కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నయీంనగర్ నాలాను పరిశీలించిన ఎమ్మెల్యే

హన్మకొండ: హనుమకొండలోని నయీంనగర్ నాలా పరివాహక ప్రాంతాలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. రాజాజీనగర్ వద్ద నూతనంగా నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా పూడికతీత పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వానాకాలం సమీపిస్తున్నందున వెంటనే పూడికతీత పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి



నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

హసన్‌పర్తి: కేంద్రప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని హక్కుల సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన హసన్‌పర్తి మండలం చింతగట్టుకు చెందిన బూర రాకేష్ సంస్మరణ సభ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పౌర హక్కులతో పాటు వివిధ ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన రాకేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తొలుత రాకేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భారత్ బచావో ప్రతినిధి ఇన్నయ్య, పౌరహక్కుల సంఘం ప్రతినిధి నారాయణ, ఆదివాసీ హక్కుల వేదిక ప్రతినిధి లక్ష్మణ్, చైతన్య మహిళా సంఘం ప్రతినిధి కళక్క, కేఎన్‌పీఎస్ ప్రతినిధి అభివన్, ఐఏపీఎల్ ప్రతినిధి ఉరేష్‌కుమార్, టీపీఎఫ్ ప్రతినిధి రమాదేవి, పూర్వ విప్లవ విద్యార్థి సంఘం ప్రతినిధి రవన్న, ఏబీఎంఎస్ ప్రతినిధి శాంతక్క, రైతు సమస్యల సాధన సమితి ప్రతినిధులు ఎరుకల రాజన్నన, ఒంజన్న, సీఎల్‌సీ ప్రతినిధి కుమారస్వామి, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న రాజారెడ్డి

హసన్‌పర్తి: పరిసరాల పరిశుభ్రతతోనే వివిధ రకాల వ్యాధుల నుంచి రక్షణ కలుగుతోందని బల్దియా ప్రజారోగ్య అధికారి రాజారెడ్డి అన్నారు. 55వ డివిజన్ గోపాలపురంలోని అరుణోదయ కాలనీలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో వివిధ రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, అధికారులు బాషా, అనిల్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణకు అభినందనలు



కాజీపేట అర్బన్: పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగను న్యూశాయంపేటలోని తన నివాసంలో శ్రమ శక్తి అవార్డు గ్రహీత కుసుమ శ్యాంసుందర్, తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం డబ్బులు ఇస్తే రద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి: ఇందిరమ్మ ఇళ్ల కోసం బ్రోకర్లకు డబ్బులు ఇచ్చినట్లు తెలిస్తే వారి ఇళ్లు రద్దు చేయడమే కాకుండా, తీసుకున్న వారిపై కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హెచ్చరించారు. ఇందిరమ్మ పథకం కింద ఎంపికైన వారికి చింతగట్టు క్యాంప్ సమీపంలోని కేఎల్ఎన్ గార్డెన్‌లో మంజూరు పత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ పథకం నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు. రాజకీయాలతీతంగా అర్హులైన వారందరికీ పథకం వర్తింపజేస్తామని తెలిపారు. ప్రజలతో ఎన్నికైన తాము నాయకులం కాదని, ప్రజా సేవకులమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీసీఈఓ విద్యాలత, హౌజింగ్ డీఎం రవీందర్‌నాయక్, ఎంపీడీఓ కర్ణాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు మేర్గు రాజేష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుద్దె పెద్దన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పొన్నాల రఘు, హరిబాబు, గడ్డం శివరాంప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, ఎస్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు దయాకర్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

కాజీపేట అర్బన్: భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని హనుమకొండ ఆర్డీఓ రమేష్ రాథోడ్ తెలిపారు. కాజీపేట మండలం న్యూశాయంపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలిరోజు సదస్సులో సాదాబైనామా, పాసు పుస్తకంలో భూ వివరాలు తప్పుగా నమోదు అయ్యాయని, తమ పేరు రావడం లేదని, పహానీలో పేరుంది కానీ పాసుపుస్తకం రాలేదని, తదితర భూ సమస్యలపై 64 దరఖాస్తులను న్యూశాయంపేట గ్రామస్తులు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భావ్‌సింగ్, డీటీ ప్రణయ్, ఆర్ఐలు కృష్ణ, శివ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూభారతి అమలు

ఖిలా వరంగల్: భూ సమస్యలను గ్రామాల్లోనే పరిష్కరించి, పారదర్శకంగా భూ భారతి చట్టాన్ని అమలు చేస్తామని ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని వసంతాపురం, నక్కలపెల్లి గ్రామాల్లో రెవెన్యూ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం భూ భారతి సదస్సును నిర్వహించారు. కార్పొరేటర్లు గద్దె బాబు, ఈదురు అరుణతో కలిసి సదస్సును తహసీల్దార్ ప్రారంభించి రైతుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీటీ రమేష్, ఆర్ఐ ఆనంద్‌కుమార్, సర్వేయర్ రజిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు జమచేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

న్యూశాయంపేట: వానాకాలం సీజన్ రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ కలెక్టరేట్ ఎదుట మంగళవారం జరిగిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసారి ముందస్తు వర్షాలు కురవడంతో సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారని అన్నారు. ఈక్రమంలో రైతులకు పెట్టుబడి కోసం రైతు భరోసా నిధులను వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సరఫరా చేయాలని సూచించారు. మండల స్థాయిలో రైతు సమావేశాలు ఏర్పాటు చేసి, భూముల రకాలను బట్టి పంట సాగును రూపొందించాలన్నారు. ధర్నా అనంతరం సంఘం నాయకులతో కలిసి కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు సాగర్ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో చింతమల్ల రంగయ్య, ఈసంపల్లి బాబు, పి.కృష్ణారెడ్డి, ఇస్లావత్ నెహ్రూ, శ్రీనివాస్‌రెడ్డి, కే.నరసింహాస్వామి, కోడెం రమేష్, అఖిల్, మహేందర్, రాజు, ఎల్లయ్య, కనకమల్లు, మల్లయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తొలగించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి



డంపింగ్ యార్డు వద్ద మాట్లాడుతున్న భిక్షపతి

మడికొండ: మడికొండ సమీపంలోని డంపింగ్ యార్డు తొలగించాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్. మడికొండ – రాంపూర్ డంపింగ్ యార్డును సీపీఐ నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు ద్వారా వెలువడుతున్న పొగతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డంపింగ్ కారణంగా వ్యర్థపు నీటితో భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు డంపింగ్ యార్డును అక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని భిక్షపతి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి నాయకులు మునిగాల భిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం, కొట్టె వెంకటేష్, లకావత్ లక్ష్మి, వేల్పుల సారంగపాణి, పద్మ, స్వరూప, రమేష్, రాములు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న జ్ఞానేశ్వర్

- జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్

ఖిలా వరంగల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద టీఎస్ యూటీఎఫ్ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బడిబాట ప్రచారజాతా కార్యక్రమాన్ని ఆయన మంగళవారం జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన ఉచిత విద్య అందుతోందని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడం కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం టీఎస్‌యూటీఎఫ్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించి పిల్లలు ప్రైవేట్‌కు తరలకుండా అడ్డుకట్ట వేయాలని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు డి.కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటికాయల కుమార్, సుజన్ ప్రసాద్ రావు, దామోదర్, అన్నాదేవి పాల్గొన్నారు.

గులాబీ సైనికుడు తన్నీరు హరీశ్‌రావు



కేక్ తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

హన్మకొండ: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు నిఖార్సైన గులాబీ సైనికుడని రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత నాగూర్ల వెంకటేశ్వర్లు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో హరీశ్‌రావు పుట్టిన రోజు వేడుకలను మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం మొదలు నుంచి కేసీఆర్ వెన్నంటి నడిచిన ఉద్యమకారుడు హరీశ్‌రావు అని కొనియాడారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు వెన్నుదన్నుగా నిలుస్తున్న గొప్ప నాయకుడు అని గుర్తుచేశారు. నీటి పారుదల, ఆర్థిక మంత్రిగా రాష్ట్రానికి ఎనలేని సేవలు అందించారన్నారు. చరిత్రలో నిలిచిపోయే కాళేశ్వర ప్రాజెక్టు సాకారంలో కేసీఆర్‌తో పాటు హరీశ్‌రావు శ్రమ, కృషి మరువలేనిదని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, నాయకులు సంకు నర్సింగ్ రావు, జోరిక రమేష్, ఉడుతల సారంగపాణి, భరత్ కుమార్ రెడ్డి, నయీమొద్దీన్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కేయూ క్యాంపస్: హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్లతో కలిసి కళాశాలల ఆవరణలో పలు మొక్కలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ స్వామి, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

లైబ్రరీకి పుస్తకాల వితరణ

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ జిల్లా గ్రంథాలయానికి జాతీయ, అంతర్జాతీయ అంశాలతో కూడిన 200 పుస్తకాలను జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశురాములు వితరణ చేశారు. ఈ మేరకు గ్రంథాలయం సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్‌కు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రేడ్ -3 గ్రంథపాలకుడు పురుషోత్తం, సిబ్బంది గుడికందుల రాజేష్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ మనోహర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు పరిశోధకులు అభినందనలు తెలిపారు. కళాశాలలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వసతిగృహాల సమస్యలు, పరిశోధకులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రాక్టికల్స్ నిర్వహించే అంశాలు, స్పోర్ట్స్ ఈక్విప్‌మెంట్స్‌పై దృష్టి సారించాలని కోరారు.

పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలి

హసన్‌పర్తి: ఈనెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న క్రమంలో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు మండల విద్యాశాఖ అధికారి రాజిరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కాసరబోయిన రవితేజ మాట్లాడుతూ సర్కారు పాఠశాలలు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు కుక్కల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐకి సన్మానం

కాజీపేట: కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకన్నను స్మార్ట్ అండ్ సేఫ్ ఆటో యూనియన్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సీఐకి పూలమొక్క అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు దార సూరి, సభ్యులు రాంబాబు, అంజాద్, యాకూబ్, గోపి, వినోద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన నాటక పోటీల కరపత్రాల ఆవిష్కరణ

హన్మకొండ కల్చరల్: వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వరంగల్‌లోని పోతన విజ్ఞానపీఠం ఆడిటోరియంలో ఈనెల 13, 14, 15వ తేదీల్లో రాష్ట్రస్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నాటక పోటీల కరపత్రాలను తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య, సెక్రటరీ ఎస్ఎస్ఆర్ మూర్తి, కుసుమ సుధాకర్, మాలి విజయ్‌రాజ్, వడ్డేపల్లి నర్సింగరావు పాల్గొన్నారు.

ఆలయాల్లో ముదిరాజ్ కులస్తుల పూజలు

హన్మకొండ కల్చరల్: ముదిరాజ్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ యువసేనను రాష్ట్రవ్యాప్తం చేయడంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయాలను మంగళవారం సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు దేవాలయాలను సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు సుంకరబోయిన మహేష్, కాషబోయిన శేఖర్, డాకూరి అర్జున్, మల్లేష్, మాల వంశీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాల నిర్మాణం ఆపేయాలి

హన్మకొండ కల్చరల్: కాపువాడలోని భద్రకాళి చెరువు దిగువనున్న ఊళ్ళో ఆంజనేయస్వామి దేవాలయ ఇనామ్ భూమిలో వేద పాఠశాల నిర్మాణాన్ని ఆపివేయాలని రాష్ట్రీయ హిందూ పరిషత్, దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చీకటి రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు వరంగల్ జిల్లా దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, అసిస్టెంట్ కమిషనర్ రామల సునీతకు లీగల్ నోటీసులు అందజేసినట్లు తెలిపారు. సర్వే నంబర్ 817లో ఎకరం 20గుంటల ఇనామ్ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిగాయని లోకాయుక్తాలో ఫిర్యాదు చేశానని, ప్రస్తుతం కేసు కోర్టులో ఉన్నందున దేవాలయ ఇనామ్ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని, లీజుకు ఇవ్వొద్దని పేర్కొన్నారు.

ఎస్సీ గురుకులాల సెక్రటరీని తొలగించాలి

కాజీపేట అర్బన్: దళిత విద్యార్థులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎస్సీ గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణిని తక్షణమే ఆ పదవి నుంచి తొలగించి, కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ రాజకీయ పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెరిపోతుల విల్సన్ మాదిగ డిమాండ్ చేశారు. కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

8న భారత వికాస పరిషత్ వర్క్‌షాప్

న్యూశాయంపేట: ఈనెల 8న హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాల సెమినార్ హాల్‌లో భారత వికాస పరిషత్ ప్రాంత వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు బీవీపీ ఓరుగల్లు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సుధీర్‌కుమార్, సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20 శాఖల నుంచి సుమారు 100 మంది ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎన్‌జీఓ, క్లాస్‌ఫోర్త్ ఎన్నికల నోటిఫికేషన్

- 20న ఎన్నికలు, ఫలితాల వెల్లడి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎన్‌జీఓ, క్లాస్ ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలకు యూనివర్సిటీ అధికారులు మంగళవారం నోటిఫికేషన్ జారీచేశారు. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌గా పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ వ్యవహరిస్తున్నారు. ఆ రెండు అసోసియేషన్లకు వేర్వేరుగా ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, ట్రెజరరీ పదవులకు నామినేషన్ల ప్రక్రియ ఈనెల 9వ వరకు కొనసాగనుంది. ఈనెల 13న సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, సాయంత్రం 6గంటలకు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాల ప్రదర్శన. ఈనెల 20న ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ, 21న ఉదయం 11గంటల నుంచి ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలను వెల్లడిస్తారు. ఎన్నికైన అభ్యర్థులు రెండేళ్లపాటు ఆయా పదవుల్లో కొనసాగుతారు.